రెండవ మరణమని ప్రకటన 21:8లో వర్ణించబడినది. ఈ రెండవ మరణము పాపము యొక్క ఆఖరి పర్యవసానము.

**పాపమువలన కలిగే మరొక పర్యవసానమున్నది.** పాపము మానవుని నైతిక బానిసత్వమునకు నడుపును. పాపము చేయువాడు పాపమునకు దాసుడని యేసు చెప్పెను (యోహాను 8:34). పాపము చేయువాడు నిజానికి పాపమునకు దాసుడు. రోమాలోయున్న క్రైస్తవులు క్రీస్తుకు విధేయులు కాకముందట పాపమునకు దాసులై యుండిరని అపో.పౌలు వారికి జ్ఞాపకము చేసెను (రోమా 6:17,18). పాపపు బానిసత్వము మోసకరమైనది. పాపము చేయువాడు నిజానికి అపవాదికి పని చేయుచున్నాడు.

క్రీస్తుకు విధేయులగువారెవరో వారే స్వతంత్రులు. క్రీస్తు మానవులను నిజముగా స్వతంత్రులను చేయును. మీరు సత్యమును తెలిసికొందురు, సత్యము మిమ్మును స్వతంత్రులనుగా చేయునని యేసు ప్రకటించెను (యోహాను 8:32). ఒకని యిష్టము వచ్చిన దానిని చేయుట నిజమైన స్వతంత్రము కాదుగాని ఒకడు ఎట్టి క్రియలను చేయవలెనో వాటినే చేయుట, మరి ముఖ్యముగా సర్వజ్ఞానియైన దేవుడు చెప్పినదానిని చేయుట, ఆయన నిషేధించిన వాటిని చేయకుండుటయే. శిక్ష ననుభవించకుండ పాపముచేసిన మానవుడెవడు లేడు. తాను చేసిన దుష్క్రియకు తగిన ప్రతిఫలమును మానవుడు ఖచ్చితముగా ఒకానొకప్పుడు పొందును.

పాపము యొక్క శిక్షను తప్పించుకొను నిమిత్తము యేసుక్రీస్తునందు విశ్వాసముంచుము. నీ పాపముల విషయమై మారుమనస్సు పొందుము, పాపక్షమాపణ నిమిత్తము క్రీస్తు నామమున బాప్తిస్మము పొందుము. పాపము నుండి విడుదల పొంది క్రీస్తు సంఘములో క్రీస్తును మహిమ పరచుచూ జీవించుము.

**– జాషువా గూటం**




# సత్యవాక్కు

**పోస్టు బాక్స్ - 80, కాకినాడ**
**ఆంధ్రప్రదేశ్ - 533 001.**
**ఫోన్ : 0884-2363722, సెల్ : 98489 98547**
**ఎడిటర్ : జాషువా గూటం**

**క్రొత్త నిబంధన క్రైస్తవ పునరుద్ధరణ కొరకు**

**సంపుటి - 44 నవంబరు - 2022 సంచిక -4**


## ఒక మాదిరి ప్రార్థన

యేసుప్రభువు యొక్క సువార్త పరిచర్య ఆరంభదినాలలో తన శిష్యులకాయన ఒకమాదిరి ప్రార్థన నేర్పించారు. "కాబట్టి మీరీలాగు ప్రార్థన చేయుడి: పరలోకమందున్న మా తండ్రీ, నీ నామము పరిశుద్ధపరచబడును గాక, నీ రాజ్యము వచ్చును గాక, నీ చిత్తము పరలోకమందు నెరవేరుచున్నట్లు భూమియందును నెరవేరును గాక. మా అనుదినాహారము నేడు మాకు దయచేయుము. మా రుణస్థులను మేము క్షమించియున్న ప్రకారము మా రుణములు క్షమించుము. మమ్మును శోధనలోకి తేక దుష్టుని నుండి మమ్మును తప్పించుము" (మత్తయి 6:9–13).

**మనము గమనించ దగిన విషయములు :-** 1. యిది ఒక మాదిరిగా ఇయ్యబడిన ప్రార్థన అని గమనించుము. అది క్రీస్తు యేసు మరణ సమాధి, పునరుత్థానములకు ముందు నేర్పించబడిన మాదిరి ప్రార్థన. "కాబట్టి మీరు ఈలాగున ప్రార్థన చేయుడి"యని ఆయన వారిని ముందుగా హెచ్చరించారు. మాకు ప్రార్థన చేయుట నేర్పుమని శిష్యులాయనను అడిగినప్పుడు" ఆయన మీరు ప్రార్థన

చేయునప్పుడు అనే మాటలతో దానిని ప్రారంభించారు (లూకా 11:1-4). ఈ మాదిరిప్రార్ధనలోని మాటలను ఆయన పలుకక ముందు మత్తయి 6:7లో "మీరు ప్రార్ధన చేయునప్పుడు అన్యజనులవలె వ్యర్ధమైన మాటలు వచింప వద్దు. విస్తరించి మాటలాడుట వలన తమ మనవి వినబడునని వారు తలంచుచున్నారు" అని హెచ్చరించారు. గనుక ప్రభువు నేర్పిన ప్రార్ధననే వారు వల్లించాలని ఆయన ఉద్దేశ్యము కాదు.

**ఈ మాదిరి ప్రార్ధన పెంతెకొస్తుకు ముందియ్యబడెనని గమనించుము.** (అపొ.కా. 2వ అధ్యాయము చూడుము). అందువలన నీ రాజ్యము వచ్చును గాక యని వారికి చెప్పబడింది. అపొ.కా. 2వ అధ్యాయములో ఆయన రాజ్యమైన సంఘము వచ్చేసింది. యేసుక్రీస్తు పునరుత్థానుడైన మొదటి పెంతెకొస్తు నాడు యెరూషలేములో ఆయన రాజ్య మైన సంఘము 3000 మందితో ఆరంభమయ్యింది (అపొ.కా. 2:33 -41). ఆయన రాజ్యము వచ్చేసింది. గనుక ఇప్పుడు అది విస్తరించుచున్నట్లు మనం ప్రార్ధించాలి. యిది జరిగిన కొంత కాలానికి "ఫిలిప్పు దేవుని రాజ్యమును గూర్చియు యేసుక్రీస్తు నామమును గూర్చియు సువార్త ప్రకటించుచుండగా వారతని నమ్మి పురుషులును, స్త్రీలును బాప్తిస్మము పొందిరి" (అపొ.కా. 8:12). యిది సమరయలో జరిగెను. యోహాను ప్రకటన గ్రంధము వ్రాయుసరికి అతడు "యేసునుబట్టి కలుగు శ్రమలోను, రాజ్యములోను పాలివాడై యున్నట్లు" చెప్పాడు (ప్రకటన 1:9).

ఆమేన్ అను మాటలతో ప్రభువు ఈ ప్రార్ధనను ముగించారు. ఆయన వ్యక్తిగతంగా ఆనాడు వారితో యున్నారు. తరువాత ఆయన పరలోకమునకేగిపోవునప్పుడు, "ఆ దినమున దేనిని గూర్చియు మీరు నన్ను అడుగరు, మీరు తండ్రిని నాపేరట ఏమి అడిగినను ఆయన మీకు అనుగ్రహించునని మీతో నిశ్చయముగా చెప్పుచున్నానని" తన శిష్యులకు



తెలియజేసెను (యోహాను 11:13). మరల "ఆ దినమున మీరు నాపేరట అడుగుదురు గాని..." అని వారితో చెప్పెను (16:26). గనుక నేడు మన ప్రార్ధనలన్నియు తండ్రియైన దేవునికి చేయుచు యేసుక్రీస్తు నామమున అడుగుచున్నాము. ఏలయనగా ఆయన మన మధ్యవర్తియైయున్నారు. "దేవుడొక్కడే, దేవునికిని నరులకును మధ్యవర్తియు ఒక్కడే; ఆయన క్రీస్తు యేసనునరుడు" (1తిమోతి 2:5)

యేసుక్రీస్తు మన ప్రధాన యాజకుడు కూడా (హెబ్రీ 8:1). క్రీస్తు రాజ్యమైన సంఘములో ఒక ప్రత్యేక యాజకవర్గమంటూ యేదీలేదు. ఏలయనగా యేసుక్రీస్తు మనందరిని తనకు యాజకులనుగా చేసికొని యున్నారు (ప్రకటన 1:6). గనుక క్రీస్తు సంఘములో యున్న విశ్వాసులందరు యాజకులే. ఏలయనగా క్రైస్తవులు "పరిశుద్ధ జనమును ఏర్పరచబడిన వంశమును, రాజులైన యాజక సమూహములై యున్నారు" (1 పేతురు 2:9). మనము రాజులైన యాజక సమూహము గనుక మన మధ్యవర్తి యైన యేసుక్రీస్తు ద్వారా దేవుని కృపా సింహాసనమును నేరుగా మనము చేరు కొనగలము" (హెబ్రీ 4:14).

**యేసు నేర్పిన మాదిరి ప్రార్ధనలో పది అంశములున్నాయి :** అవి తండ్రిని సంబోధించుట, తండ్రి నామమును ఘనపరచుట, రాజ్యము కొరకు ప్రార్ధించుట, దేవుని చిత్తము భూలోకమందును నెరవేరునట్లు ప్రార్ధించుట, మన అనుదినాహారము కొరకు ప్రార్ధించుట, క్షమాపణ కొరకు ప్రార్ధించుట, దుష్టుని నుండి విడుదలకు ప్రార్ధించుట ఘనత, మహిమ, రాజ్యము తండ్రిదేయని ఒప్పు కొనుట, యేసునామమున ప్రార్ధించుట, ఆమేన్ అని చెప్పుట. ఈ అంశములను ఇప్పుడు పరిశీలింతుము:

**1. తండ్రిని సంబోధించుట :** "పరలోకమందున్న మా తండ్రీ", ఆయన మన తండ్రియైన దేవుడు

గనుక మన ప్రార్థనలో ఆయననట్లు సంబోధించాలి (అపొ.కా.4:24). ఆయన మన ఆత్మీయ తండ్రి. మనందరికీ భూసంబంధమైన తండ్రులున్నారు (హెబ్రీ 4:9) గాని సజీవుడైన దేవుడే మన ఆత్మలకు తండ్రియై యున్నారు. అందువలన ఏదోఒక మనుష్యుడు తండ్రి (ఫాదర్) అనే బిరుదు తగిలించుకొనుట, అట్లు పిలిపించుకొనుట పాపము. "భూమి మీద ఎవనికిని తండ్రి యని పేరుపెట్టవద్దు, ఒక్కడే మీ తండ్రి, ఆయన పరలోక మందున్నాడు" అని యేసు బోధించారు (మత్తయి 23:9).

**2. తండ్రి యొక్క నామమును ఘనపరచాలి :** "నీ నామము ఘనపరచబడునుగాక!". అనగా ఆయన నామమును పరిశుద్ధముగా ఎంచాలి. దేవుని సింహాసనము చుట్టుయున్న సెరాపులు, "సైన్యములకు అధిపతియైన యెహోవా పరిశుద్ధుడు, పరిశుద్ధుడు, పరిశుద్ధుడు" అని రాత్రింబగళ్ళు ఆయనను కొనియాడుచు యుండును (యెషయా 6:3; ప్రకటన 4:8).

**3. రాజ్యము కొరకు ప్రార్థించాలి :** యేసుప్రభువు ఈ మాదిరి ప్రార్థన నేర్పించేసరికి ఆయన రాజ్యము ఇంకా స్థాపించబడియుండలేదు. అయితే ఆయన రాజ్యమైన సంఘము బలముతో, పెంతెకొస్తు దినమున యెరూషలేములో స్థాపించబడెను (మార్కు 9:13; అపొ.కా. 2:33-41). అది స్థాపించబడియున్నట్లు పరిశుద్ధాత్ముడు (కొలస్స 1:13)లో మనకు నిర్ధారణ యిచ్చియున్నారు. ఆయన రాజ్యమైన సంఘము వచ్చేసింది. స్థిరపడియున్నది గనుక అది రావాలనిగాక అది భూలోకమంతా విస్తరించాలని మనము నేడు ప్రార్థించాలి (హెబ్రీ 12:28).

**4. పరలోకమందు దేవుని చిత్తము నెరవేరుచున్నట్లు భూమిమీదను నెరవేరాలని మనం ప్రార్థించాలి :** మనము రాజుల కొరకు, అధిపతుల కొరకు ప్రార్థించాలి. వారు తమ ఏలుబడిని దేవుని చిత్త ప్రకారము చేయాలని ప్రార్థించాలి (1 తిమోతి 2:2). మన జీవితములలో కూడ ఆయన చిత్తము నెరవేరునట్లు ప్రార్థించాలి. "నా యిష్టము నెరవేర్చుకొనుటకు నేను రాలేదు; నన్ను పంపిన వాని చిత్తము నెరవేర్చుటకే నేను వచ్చితినని" యేసు చెప్పెను (యోహాను 6:38).

**5). మా అనుదినాహారము నేడు మాకు దయచేయుమని ప్రార్థించాలి :** ధనము కొరకు కాదు గాని మన దైనందిన అవుసరముల కొరకు ప్రార్థించాలి. జ్ఞానియైన సొలొమోను ఇట్లు ప్రార్థించాడు. "పేదరికమునైనను ఐశ్వర్యమునైనను నాకు దయచేయకుము. తగినంత ఆహారము నాకు అనుగ్రహింపుము. ఎక్కువైన యెడల నేను కడుపునిండిన వాడనై నిన్ను విసర్జించి, యెహోవా యెవడని అందునేమో లేక బీదనై దొంగిలి నా దేవుని నామమును దూషింతునేమో" (సామె 30:8,9). సంతుష్టిసహితమైన దైవభక్తి గొప్ప లాభసాధకమైయున్నది. కాగా అన్న వస్త్రములు గలవారమైయుండి వాటితో తృప్తిపొందియుందము (1తిమోతి 6:6-9).

**6. క్షమాపణ కొరకు ప్రార్థించాలి:** క్షమాపణ కొరకు ప్రార్థించునప్పుడు మనమే క్షమాగుణము కలిగియుండాలి. "మన పాపములను మనము ఒప్పుకొనిన యెడల ఆయన నమ్మదగినవాడును, నీతిమంతుడును గనుక ఆయన మన పాపములను క్షమించి సమస్త దుర్నీతినుండి మనలను పవిత్రులనుగా చేయును" (1యోహాను 1:9).

**7. దుష్టుని నుండి విడుదల కొరకు ప్రార్థించాలి :** దేవుడు తన వారిని ప్రేమించి, కటాక్షించును. మన దేవుడు ఎంతో జాలియు, కనికరమును గలవాడు (యాకోబు 5:11). గనుక దుష్టుని నుండి ఆయన మనలను రక్షించునట్లు ప్రార్థించవలెను.

**8. దేవుని యొక్క మహిమను ఘనతను ఒప్పుకొనుము:** "రాజ్యము, బలము, మహిమయు నీవైయున్నవి, ఆమెన్" అని యేసు ఆ ప్రార్థనలో నేర్పించారు (మత్తయి 6:13). మరల

“క్రీస్తుయేసు మూలముగా సంఘములో తరతరములు, సదాకాలము మహిమ కలుగునుగాక, ఆమేన్” (ఎఫెసీ 3:21; ప్రకటన 4:11).

**9. యేసు నామమున ప్రార్థించాలి:** పైనుదహరించిన రీతిగా మన ప్రార్థనలు యేసునామమున చేయబడాలి. ఆయన మన ప్రధాన యాజకుడు, మన మధ్యవర్తి గనుక ఆయన ద్వారా మన ప్రార్థనలు దేవునికి చేయాలి. ఆయన నేర్పినది మాదిరి ప్రార్థన గనుక ఆయన నామమును గూర్చి అక్కడ యేమీ చెప్పబడలేదు.

**10. ఆఖరిగా, ఆమేన్ అని పలకాలి :** ఆమేన్ అనునది హెబ్రీ పదము. అట్లవునుగాక యని దాని యర్థము. 1 కొరింథీ 14:16 చదువుము.

**–జిమ్ వాల్డన్**

# మానవ శరీర నిర్మాణము

మనము నడిపే కారులు చాల ఆశ్చర్య వాహనములు. వాటికి రేడియోలు, చీకటిలో నడుపుటకు కాంతివంతమైనలైట్లు, దానిని చలింపజేయుటకు ఇంజన్లు వగయిరా యుంటాయి. అయితే మానవశరీర నిర్మాణము దగ్గర అవి ఎందుకును పనికిరావు, కొన్నిసార్లు మానవ శరీరము వందసంవత్సరముల మట్టుకు చలించును. అయితే వంద సంవత్సరముల మట్టుకు పనిచేసే కార్లు ఎక్కడైనా యున్నాయా? కార్లను ఎట్లయితే వాహన ఇంజనీర్లు నిర్మించారో, మానవ శరీరానికి కూడా ఒక నిర్మాణకుడు వున్నారు. ఆయనే దేవుడు! మన శరీరరంలో యున్న ఆశ్చర్యకరమైన కొన్ని అవయవముల నిర్మాణమును ఇప్పుడు తెలిసికొందము:

**కణము :** మానవశరీరములో 20 రకములకంటే ఎక్కువైన కణములున్నవి. ఎర్రకణములు, తెల్లకణములు, నరముల కణములు మొదలైనవి ఎన్నో



మన శరీరములో యున్నాయి. వాటి మొత్తం అంతా లక్షకోట్లకు పైగా యుండును. మానవ శరీరములో యున్న కణములన్నీ ఒకదాని ప్రక్కన ఒకటి ఉంచితే అవి భూమిని 210 సార్లు చుట్టు తిరుగునవన్నియుండును. మహా అద్భుత నిర్మాణకుడు ఈ కణములన్నీ సృజించారు. వాటిని మన శరీరంలో ఎక్కడ ఉండాలో అక్కడ వుంచారు.

**చర్మము :** నీ చర్మము ఆశ్చర్యకరమైన అవయవము. అది నిన్ను గాలి నుండి, వర్షము నుండి, క్రిముల నుండి, ఎండనుండి, చలినుండి కాపాడును. అయినను దానిలో చిన్న చిన్న సూక్ష్మ రంధ్రములున్నవి. వాటివలన వేసవిలో నీ శరీరము చల్లగాను, చలికాలంలో వేడిగాను యుండును. మానవశరీరములో యున్న అతిపెద్ద అవయవము అది. ఒక పెద్ద మనిషి చర్మము 20 చదరపు అడుగులుండును మరియు 9 పౌండ్ల బరువుండును. పావులా బిళ్ల వంటి చర్మములో 4 గజముల నరముల కణములు, 25 నరముల చిగుళ్లు, 100 స్వేద గ్రంథులు వుండును మరియు 30 లక్షల కణములుండును.

**నాలుక :** మన నాలుకపై రుచి చూచే చిగుళ్లుండును. నీకేది యిష్టమో (మంచిదో) ఏది యిష్టము కాదో (మంచిదికాదో) ఒక్క ఘడియలో అవి తెలియజేయును. అది ఒక కండరమే అయినను మనం మాటలాడుటకు సహాయంచేయును, ఆహారం, పానీయం మ్రింగుటకు సహాయ పడును. నీకిష్టమైన ఆహారమును తినేటప్పుడల్లా, దాని సృష్టికర్తను స్మరించుకొనుము.

**కన్ను :** నీ కన్ను నిజంగా చాలా ఆశ్చర్యకరమైనది. ఎంత ఆశ్చర్యమైనదంటే మానవుడు కృత్రిమ నేత్రమును తయారుచేయలేదు. మానవ నేత్రము లక్షాయాభైవేల వర్తమానములను ఒకేసారి గ్రహించగలదు, చూడగలదు. మరియు మనకున్న జ్ఞానమంతటిలో నూటికి 80 పాళ్ళు నేత్రముల నుండి

సేకరించినదే. నీ కన్ను లోపలయున్న ప్రత్యేక కణముల ద్వారా వివిధ రంగులను, వస్తువులు దూరమును గ్రహించగలదు. ఒక రోజులో నీ కన్ను 10లక్షల సార్లు కనురెప్పలనాడించును. తద్వారా నీ నేత్రములను పరిశుభ్రముగా యుంచును.

**చెవి :** మానవశరీరములో యున్న మరియొక అద్భుత అవయవము నీ చెవి. దానిలో మూడు భాగములున్నాయి. బాహ్యాచెవి, మధ్య భాగము మరియు అంతరంగ భాగము. నీ రెండు చెవులు అద్భుత శ్రావణ యంత్రములు. అవి బయట నుండి వచ్చే శబ్ధతరంగములను, సెకనుకు 1087 అడుగుల వేగముతో అవి వచ్చినా, ఆతరంగములు చెవి మధ్యభాగములో యున్న ఒక చిన్న గొట్టము ద్వారా లోపలికి ప్రవేశించును. ఆగొట్టమంతటిలో శబ్ధతరంగ పొర ద్వారా అవి మెదడుకు చేరుకొనును. శబ్ధతరంగములు ఆ పొరను తాకగా అది చలించును. ఆ శబ్ధతరంగముల అలలు లోపలి భాగములో యున్న మూడు చిన్న ఎముకలను తాకగా మనము శబ్ధమును విందుము. ఆ శబ్ధము పెంచబడి మెదడునుతాకును. యిదంతా చాల సున్నితముగా చేయబడిన అవయవము. దానిని నిర్మించిన వాడు ఆశ్చర్యకరుడైన దేవుడు.

**అస్థిపంజరము :** వయస్సు వచ్చిన మానవుని శరీరములో 206 ఎముకలుండును. పసిపిల్లలకు 350 ఎముకలుంటాయి గాని వయస్సు పెరిగే కొలది అవి మిగతావాటిలో కలసి పోయి చివరకు 206 ఎముకలుండును. మానవుని అస్థిపంజరము శరీరములోని కండరములకు సపోర్టుగా యుండు ఒక ఎముకల పందిరిగా యుండును. ఎముకలు కండరముల వలన మనము నడుస్తాము, పరుగెడ్తాము, ఆటలాడుతాము, జంప్ చేస్తాము! దానివలన మన అంతరంగ అవయవములన్నీ కాపాడబడతాయి.

**రక్తప్రసరణ విధానము :** మన శరీరములోని రక్తప్రసరణ విధానములో గుండె, రక్తనాళములు, శిరలు, ధమనులు యుండి అనేక ప్రాముఖ్య



కార్యక్రమములు చేయుచు యుండును. మొదటిగా మనం జీర్ణించుకొనిన ఆహారము రక్తప్రసరణ ద్వారా శరీరములోని అన్ని భాగములకు అందించబడును. రెండవదిగా ఆహారమును జీర్ణించుటకుగాను అవుసరమైన వేడిని అది కలుగుజేయును. మరియు శరీరమందలి వ్యర్ధములను అది కొనిపోవును. మనకు తెలియకుండానే ఈ రక్తప్రసరణ క్రియ మనశరీరములో నిరంతరము జరుగుచు యుండును.

**నాడీ విధానము :** మానవ శరీర నాడీ విధానము ఆశ్చర్యకరమైన వార్తావిధానము. ఏదైనా వేడి వస్తువును నీవు తాకినట్లయితే, నీ నాడీ విధానము దాని వేడిని తక్షణమే గ్రహించి నీ చేతిని తొలగించుమని నీకు వర్తమానము పంపును. మన శరీరములో అన్ని అవయవముల పనిని ముఖ్యముగా గుండె, కాలేయము, ఊపిరితిత్తులు, కిడ్నీలు మొదలగు వాటిని అది నియంత్రించును. మరియు మన స్పర్శను, దృష్టిని, వినికిడిని, భావములను, రుచిని, వాసనను అది కంట్రోలు చేయును. మరియు మన ఆలోచన విధానమును, నేర్చుకొను విధానమును, జ్ఞాపకశక్తిని, మొదలగు వాటిని అది నియంత్రించును.

**అధునాతన యంత్రము :** మన శరీరమంతటిలోను అనేక ప్రత్యేక అవయవములున్నాయి. అవన్నీ కలిసే పనిచేయును. మనం కోతుల నుండి అవతరించామని అనేకులు చెప్పుటకు ప్రయత్నించుచున్నారు. గాని మన శరీరములకు వాటికి లెక్కలేనన్ని తేడాలున్నాయి. దేవుడు జంతువులకు వేరుగా మానవుని తయారుచేసారు. దేవుని గ్రంథమైన బైబిలు ఇట్లు చెప్పుచున్నది: "దేవుడు తన స్వరూపమందు నరుని సృజించెను, దేవుని స్వరూపమందు వాని సృజించెను; స్త్రీనిగాను, పురుషునిగాను వారిని సృజించెను" (ఆది.కా. 1:27). ఆయన మానవుని సృజించినప్పుడు అత్యంత అధునాతన వ్యక్తిని సృజించెనుట యదార్ధము కాదా?

**–అపోలాజెటిక్ ప్రెస్**

# జ్ఞానురాలు తన యిల్లు కట్టుకొనును

"జ్ఞానురాలు తన యిల్లు కట్టుకొనును, మూఢురాలు తన చేతులతో తన యిల్లు ఊడబెరుకును" (సామెతలు 14:1). ఈ సామెత నన్ను చాల ఆకర్షించినది. గాని నేనొక భార్య, తల్లి అయ్యేవరకు అది నా హృదయమును అంతగా తాకునని నేనెన్నడు ఊహించ లేదు. నీవొక భార్యవైనా, తల్లివైనా కాకపోయినా, నీ వయస్సు ఎంత యున్నా ఈ వచనం మన హృదయాలకు దగ్గరగా యుండాలి. ఈ లోక గృహములో యుంటూ పరలోక గృహానికి చేరుకొనడానికి యిది మనలను నడిపించును. క్రైస్తవ స్త్రీలుగా, భార్యలుగా, తల్లులుగా మన యిండ్లలో సంతోషము, ఆనందము వుండునట్లును అవి క్రీస్తుకు కేంద్రముగా యుండునట్లు మనం ప్రయత్నించాలి. మనం జాగ్రత్తగా లేకపోయినా, క్రీస్తును సన్నిహితంగా ఉంచకపోయినా, మన క్రియల వలన మన సొంత యింటినే పాడు చేసికొనే శక్తి మనలో యున్నవని ఈ లేఖనభాగం ఆ భయంకర సత్యాన్ని తెలియ జేయుచున్నది.

క్రీస్తుకు కేంద్రమైన గృహముగా యుండాలంటే యేమిచేయాలి? మన యిల్లు ప్రార్ధనతో నిండినదైయున్నదా? మన యింటిలో అన్నిటికంటే ఎక్కువగా బైబిలును చదువుచున్నామా? అతిధులను సాదరముగా స్వాగతించుచున్నామా? భార్యలుగా, తల్లులుగా మన ద్వారా ప్రకాశించు వెలుగు మన యిల్లంతయు నింపునని గ్రహించుకోవాలి. "మనుష్యులు దీపము వెలిగించి మంచము క్రింద పెట్టరు గాని అది యింటనుండు వారందరికి వెలుగిచ్చుటకై దీపస్థంభము మీదనే పెట్టుదురు" (మత్తయి 5:15).

మనలోనుండి వచ్చు వెలుగు దేవునితో నడుచుటవలన పున:ప్రకాశించును. అయితే ఆయన నుండి దూరమగుచున్నప్పుడు మన వెలుగు మసకబారును గదా. మనం ఆత్మీయంగా ప్రకాశింపకపోయినప్పుడు అపవాదికి చోటు లభించును.

"జ్ఞానురాలు తన యిల్లు కట్టుకొనును" తనకున్నదంతయు దేవుని



వలననే కలిగినదని జ్ఞానురాలు ఎరుగును. జ్ఞానురాలు ఈలోకభోగములు నిమిత్తము యిల్లు కట్టదుగాని నిత్యం ఆనందము నిమిత్తము ఆత్మీయముగా తన యింటిని తీర్చిదిద్దును. ఆమె నమ్మకమైన క్రైస్తవ స్త్రీగా గుర్తింపు పొందగోరును. ఆమె తన భర్తను, బిడ్డలను ప్రేమించుచు ప్రతి దినము లేచును. తద్వారా తన యింటిని మరింత పటిష్టము చేసికొనును. ఆమె ప్రభువుతో సంభాషించుట వలన తన శక్తిని నూతనముగా పొందును. తన యిల్లు కట్టుకొనే జ్ఞానవంతురాలు ప్రభువును రక్షకుని ఘనపరచుటకే తన జీవితమునుపయోగించును.

**"మూఢురాలు తన చేతులతో తన యిల్లు ఊడబెరుకును.** జ్ఞానురాలుకు కేవలము భిన్నముగా మూఢురాలు ప్రవర్తించును. తన చేతులతో అన్నప్పుడు ఆమె బుద్ధిపూర్వకముగా విచ్ఛిన్నము చేయు క్రియలను సూచించును. ఆమె స్వంతక్రియల ద్వారా సువార్త వెలుగును ప్రకాశింపకుండ జేయును. తన భర్తతోను, బిడ్డలతోను చేయు సంభాషణలో ప్రేమ కనబడకుండును. సణుగులుగొనుగులతో ఆమె ప్రవర్తించును. తన స్వార్ధ ప్రవర్తన వలన పరిచర్య చేయలేక పోవును. ఒక్కోసారి అదుపులేని తన కోపబుద్ధివలన తన యిల్లు కట్టబడుట కంటే, చెడగొట్ట బడుట జరుగును. ఆమె యొక్క వెలుగు కొద్ది కొద్దిగా తగ్గిపోవును. ఆమె యొక్క బలహీనతలను సాతాను ఎరుగును గనుక, వాని యొక్క బాణములు ఆమె వైపు వేయబడును. క్రీస్తులో ఆమె నాటబడక యున్నందున, ఆ బాణములు ఆమె గృహమును కూలద్రోయును.

నీవు ఏ పరిస్థితిలో యున్నా, నీ గృహములో వెలుగును ప్రకాశింపజేయగలవు. యేసుక్రీస్తు వైపు తిరిగి ఆయన వాక్యప్రకారము జీవింప నిశ్చయించుకొనిన యెడల ఆయనలో యున్న వెలుగును మరింత ప్రజ్వరిల్లజేయుగలవు. ఆయన నిన్ను నడిపించును, నీకు సహాయము చేయును మరియు అందరికీ కనబడులాగున నీ గృహమును వెలిగింపజేయును.

**–మెరిడితో లిప్పీ**

# దేవుడు చెప్పుచున్న దేమిటి?

జీవితంలో సమస్య ఉద్భవించు నప్పుడు దేవుడు మనతో యేమి చెప్పు చున్నారు? మనం ఎదుర్కొనుచున్న సమస్యలు మనలను కృంగదీస్తాయి లేదా లేవనెత్తుతాయి. సమస్యలను మనం ఎట్లు ఉపయోగించుకోవాలో చాలమందికి తెలియదు. మనకు సమస్యలు వచ్చునప్పుడు దిగువ రీతులుగా వాటిని ఉపయోగించుకోవాలని దేవుడు కోరుచున్నారు.

**1. మనలను సరియైన మార్గమున నడిపించుటకు దేవుడు సమస్యలను వినియోగిస్తారు.** మనలో కదలిక కలుగజేయుటకు దేవుడు అగ్నిని రాజబెట్టవచ్చును. సమస్యలు మనలను నూతన మార్గమున నడిపించుటకుపయోగపడును. మన జీవన విధానమును మార్చుటకు ఉపయోగపడును (సామెతలు 20:30).

**2. మనలను పరీక్షించుటకు దేవుడు సమస్యలనుపయోగించును.** ప్రజలు ఒక్కోసారి టీ పేకెట్లవలె యుందురు. దానిలో ఏమున్నదో తెలిసికొనుటకు వాటిని వేడినీళ్లలో వేయుదుము ఏదైనా సమస్యతో దేవుడు నిన్ను ఎన్నడైనా పరీక్షించారా? సమస్యలు నీకేమి బయలుపరచు చున్నవి? "నా సహోదరులారా, మీ విశ్వాసమునకు కలుగు పరీక్ష ఓర్పును పుట్టించునని యెరిగి మీరు నానావిధములైన శోధనలలో పడునప్పుడు అది మహానందమని యెంచుకొనుడి" (యాకోబు 1:2,3).

**3. మనలను తప్పుదిద్దుటకు దేవుడు సమస్యలనుపయోగించును.** బాధలద్వారాను అపజయముల ద్వారాను మనం కొన్ని పాఠములను నేర్చుకొంటాము. మనం చిన్నగా యున్నప్పుడు పొయ్యిదగ్గరకు వెళ్లవద్దని వేడిగాయున్న పెనమును ముట్టువద్దని చెప్పియుంటారు. అయినా వాటిని ముట్టుకొని పాఠము నేర్చుకొని యుంటాము. స్నేహము, ప్రేమ, సహవాసములు కోల్పోయినప్పుడు మాత్రమే కొన్నిసార్లు వాటి విలువ మనం తెలిసి కొంటాము. "నీవు నీ



కట్టడలను నాకు బోధించుచున్నావు నా పెదవులు నీ స్తోత్రము నుచ్చరించును. నీ ఆజ్ఞలన్నియు న్యాయములు నీ సత్య వాక్యమును గూర్చి నా నాలుక పాడును. నేను నీ ఉపదేశములను కోరుకొని యున్నాను. నీ చెయ్యి నాకు సహాయ మగును గాక'' (కీర్తన 119:171, 172).

**4. మనలను కాపాడుటకు దేవుడు సమస్యలనుపయోగించును.** ఒక్కోసారి తెలియకుండగనే సమస్యలు మనకు ఆశీర్వాదములు కావచ్చును. ఏదైనా సీరియస్ హాని జరగకుండునట్లు సమస్యలు దోహదము కావచ్చును గత సంవత్సరంలో అనైతిక కార్యమును చేయనందుకు నా మిత్రుడొకడు తన ఉద్యోగము నుండి తీసివేయబడ్డాడు. నిరుద్యోగియయ్యాడు. అది సమస్య అయ్యింది. అతని మేనేజరు యొక్క దుష్క్రియవలన అతడు జైలుకు వెళ్లాడు. దుష్క్రియలో పాలుపుచ్చుకొన నందున నా మిత్రుడు నిరుద్యోగి అయి నిర్దోషిగానిలిచాడు. "మీరు నాకు కీడు చేయనుద్దేశించారు. నేటి దినమున జరుగుచున్నట్లు అనగా బహు ప్రజలను బ్రతికించునట్లుగా అది మేలుకే దేవుడు ఉద్దేశించెను" అని యోసేపు తన అన్నలతో చెప్పెను (ఆది.కా. 50:20).

**5. మనలను పరిపూర్ణులుగా చేయుటకు దేవుడు సమస్యలను పయోగించును.** సమస్యలను మనం సరిగా ఎదుర్కొంటే అవి మనలను పరిపూర్ణులుగా చేయును. దేవుడు నీ ప్రవర్తన విషయంలో ఆసక్తి కలిగి యున్నారు. "అంతేకాదు శ్రమ ఓర్పును, ఓర్పు పరీక్షను, పరీక్ష నిరీక్షణను కలుగజేయునని యెరిగి శ్రమల యందును అతిశయపడుదము. ఎందు కనగా ఈ నిరీక్షణ మనలను సిగ్గు పరచదు. మనకు అనుగ్రహింపబడిన పరిశుద్ధాత్మ ద్వారా దేవుని ప్రేమ మన హృదయములలో కుమ్మరింపబడి యున్నది" (రోమా 5:3-5).

దేవుడు మన జీవితములో పని చేయుచున్నారు. దానిని మనం గుర్తించకపోవచ్చును. లేదా గ్రహించకపోవచ్చును. అయితే మనం ఆయనకు సహకరించినప్పుడు అది సులభమగును.

# ఉండునను గొప్ప దేవుడు!

ఆయనే మొదటి వాడు, ఆఖరి వాడు. ఆదియు అంతమును ఆయనే. ఆయన సమస్తమును సృజించినవాడు. సర్వసృష్టికి ఆది సంభూతుడు ఆయనే! ఈ విశ్వమునకు నిర్మాణకుడు ఆయనే. సమస్తమును చలింపజేయువాడు ఆయనే. ఆయన ఎల్లప్పుడు ఉండెను. ఎల్లప్పుడు ఉన్నారు. ఎల్లప్పుడు ఉండును. ఆయన కదలింపబడడు, మార్పులేనివాడు, అపజయము నెరుగని వాడు.

ఆయన నలుగగొట్టబడెను గాని స్వస్థతనను గ్రహించెను. ఆయన మేకులతో కొట్టబడెను గాని మన బాధలకు ఉపశమనము కలుగజేసెను. ఆయన బంధింపబడెను గాని స్వాతంత్ర్యమునిచ్చెను. మరణించెను గాని సజీవుడై తిరిగి లేచెను. సమాధి చేయబడెను గాని దాన్ని జయించి లేచెను. ఆయన పాలించుచున్నారు, శాంతిననుగ్రహించు చున్నారు.

ఈ లోకము ఆయనను గ్రహించుకోలేదు. సైన్యములు ఆయనను జయించలేవు. పాఠశాలలు, కళాశాలలు ఆయనను పూర్తిగా గ్రహించుకోలేవు. నాయకులు ఆయనను నిర్లక్ష్యము చేయలేరు.

హేరోదు ఆయనను చంపలేక పోయాడు. పరిసయ్యులు ఆయనను గుర్తించ లేకపోయారు. ప్రజలాయనను బంధించలేకపోయారు. నీరో చక్రవర్తి ఆయనను పిప్పిచేయలేక పోయాడు. హిట్లరు ఆయనను అణచ లేకపోయాడు. ఆధునిక వేదాంతులు ఆయనను వివరించలేకపోయారు.

ఆయన వెలుగు, ప్రేమ, దీర్ఘాయుష్షు కలిగిన ప్రభువు. ఆయన మంచివాడు, దయగలవాడు, జాలి గలవాడు, ఆయన పరిశుద్ధుడు, నీతిమంతుడు, సర్వశక్తిమంతుడు, పవిత్రుడు ఆయన మార్గములు సత్యము, ఆయన వాక్యము నిరంతరముండును. ఆయన ఇప్పటికీ ఎప్పటికీ మార్పులేనివాడు. ఆయన మనస్సు నామీద ఉన్నది!

ఆయన నా విమోచకుడు, నా రక్షకుడు నన్ను నడిపించువాడు, నా శాంతి. ఆయనే నా సంతోషము, నా ఆదరణ. నా ప్రభువు ఆయన ప్రేమ బంధకము వలన నేనాయనను సేవింతును. ఆయన బరువు తేలిక. నా సమృద్ధి జీవమే ఆయన లక్ష్యము. ఆయనను వెంబడించుము. ఆయనే జీవమునకు జ్ఞాని. శక్తి గలవారికి ఆయనే శక్తి. ఆయన పురాతన కాలము నుండి యున్నవాడు. రాజులకు రాజు నాయకులకు నాయకుడు. ఉన్నవాటి కేమి రాబోవు వాటికేమి ఆయనే ప్రభువులకు ప్రభువు.

యిది అసాధ్యమని నీవనుకొనుచున్నయెడల దీనిని గూర్చి ఆలోచించుము. నాతో సంబంధము కలిగియుండటయే ఆయన ధ్యేయము. నన్నెన్నడు ఆయన విడువడు ఎన్నడు ఎడబాయడు, ఎన్నడు పెడత్రోవను పెట్టడు, ఎన్నడు మరువడు, ఎన్నడు నన్ను నిర్లక్ష్యము చేయడు.

నేను పడిపోయినప్పుడాయన నన్ను లేపును. నేను తప్పుచేసినప్పుడు క్షమించును. ఆయన బలవంతుడు; నేను బలహీనుడను, నేను తొట్రిల్లినప్పుడు, ఆయన నన్ను లేవ దీయును. నేను గాయపడినప్పుడాయన స్వస్థపర్చును. గ్రుడ్డివాడనైనప్పుడు నన్ను నడిపించును. ఆకలిగొనినప్పుడు నాకు ఆహారమిచ్చును. నేను శ్రమల నెదుర్కొనినప్పుడు ఆయన నాతోయుండును. నేను హింసింపబడినప్పుడు, ఆయన నన్ను ఆదుకొనును. శ్రమలనొందినప్పుడాయన నున్న ఆదరించును. నేను నష్టపోయినప్పుడు నన్ను తన యింటికి తోడ్కొని వెళ్లును.

ఆయన ప్రతివానికి సమస్తమును దయచేయువాడు. వారు ఎక్కడవున్నా, ఏ స్థలములో సమయములో యున్నా ప్రతి విధముగా సహాయము చేయును. ఆయనే దేవుడు! నమ్మకమైనవాడు! నేనాయన వాడను ఆయన నావాడు! "భయపడకుము, నేను నీకు కేడెము, నీ బహుమానం అత్యధికమగును" (ఆది.కా. 15:1).

**– కబితా గూటం**

# పాపము యొక్క పర్యవసానము -1

నైతిక విలువలను రాజకీయ ముగాను, సాంఘికముగాను అతి త్వరితగతిని కోల్పోవుచున్న నేటి మన సమాజములో పాపమును గూర్చి ఎత్తి చెప్పేవారు బహు అరుదుగా యున్నారు. దానిని తగురీతిగా ఖండించే వారు ఇంకా అరుదుగానున్నారు. నిజానికి పాపమనేది లేదని వాదించే వారి సంఖ్య దినదినము పెరుగుచు యున్నది. అయితే పాపమును ఉన్నది ఉన్నట్లుగా మానవునికి చూపించే గ్రంధమొకటి యున్నది. మానవుడు పాపి యని తన పాపముల నతనికి చూపించే గ్రంధమొకటి యున్నది. అది బైబిలు గ్రంధము. “ఏ భేదమును లేదు, అందరును పాపము చేసి దేవుడను గ్రహించు మహిమను పొందలేక పోవుచున్నారు” అని అది చెప్పుచున్నది (రోమా 3:23).

పాపమును గూర్చియు, దాని పర్యవసానము గూర్చియు బైబిలు బోధించు సంగతులను మానవులు ఎరుగవలెను. ఏలయనగా లేఖనములు పాపమును గూర్చి ఏమి బోధించుచున్నవో ఎరుగకుండ ఒకడు దేవుని గూర్చియు, క్రీస్తును గూర్చియు, పరిశుద్ధాత్మని గూర్చియు, రక్షణ మార్గమును గూర్చియు, సంఘమును గూర్చియు, నైతిక విలువలను గూర్చియు, సువార్త ప్రకటనను గూర్చియు లేఖన సంబంధమైన జ్ఞానమును కలిగి యుండుట అసాధ్యము.

**పాపము అను పదమునకు ‘గురి తప్పిపోవుట’ యని అర్థము.** మానవుడు తన సృష్టికర్తను సేవించి, ఆరాధించు నట్లు దేవుడు మానవుని చేసెను (ప్రసంగి 12:13). మానవులు దేవుని ఆజ్ఞను అతిక్రమించినప్పుడు లేదా దేవుడు కోరునది వారు చేయుటకు నిరాకరించునప్పుడు అది దేవుని వాక్యములో పాపము అని చెప్పబడినది (1 యోహాను 3:4; యాకోబు 4:17).

శిక్షననుభవించకుండా మానవులు పాపము చేయలేరు. దేవుని చిత్తమున



కవిధేయతచూపించి, పాపము చేసి దాని ఫలితముల నుండి తప్పించు కొనిన మానవులెవరులేరు. పాప జీవితము వలన కలుగు పర్యవసాన ములను గూర్చి పాపులు అంగీకరించుట కష్టము. పాపము భోగములను ప్రస్తుతానికి అనుభవించుచున్నవాడు అటుతరువాత సంభవించే దు:ఖమును గూర్చి, వేదనను గూర్చి గ్రుడ్డివాడై యుండును. ఎందువలనంటే పాపపు జీవితము యొక్క పర్యవసానము తరచు కొంత ఆలస్యముగా కనబడును. “దుష్ క్రియకు తగిన శిక్ష శ్రీఘ్రముగా కలుగక పోవుట చూచి మనుష్యులు భయము విడిచి హృదయపూర్వకముగా దుష్ క్రియలు చేయుదురు” అని దేవుని వాక్యము చెప్పుచున్నది (ప్రసంగి 8:11). పాపమునకు కలుగు శిక్ష ఆలస్యమగుటచూచి కొందరు పాపము వలన కలిగే శిక్ష ఏదియు లేదని భ్రమ పడుచుందురు.

**పాపమువలన కలిగే పర్యవసానము నుండి తప్పిచుకొనువాడెవడును లేదు :** ఆదాము హవ్వలు, నాదాబు అబీహులు, సౌలు దావీదులు, ఇస్కరియోతు యూదా మరియు అనేకులు పాపపు ప్రతి ఫలము నిజమని అది సాధారణముగా దు:ఖకరమని యెరిగి యుండిరి. వ్యభిచరించుటవలన దావీదు హృదయము ఆనంద స్తుతులతో నిండి పోలేదు, సరిగదా అతని హృదయము అపరాధమువలనను, సిగ్గువలనను నిండుకొనియుండెను. తన పాపమును దేవుని యెదుట ఒప్పుకొనుచు, “దేవా, నాయందు శుద్ధ హృదయము కలుగ జేయుము, నా అంతరంగములో స్థిర మైన మనస్సును నూతనముగా పుట్టించుము” అని వేడుకొనెను (దా.కీ.51:10). యేసుక్రీస్తును 30 వెండినాణె ముల కొరకు అప్పగించిన ఇస్కరి యోతు యూదా యొక్క దురాశ నిజముగా అంతటితో తీరిపోలేదు. అతని హృదయము అపరాధము చేతను, సిగ్గుచేతను నిండుకొని పోయెను. “నేను నిరపరాధ రక్తమును అప్పగించి పాపము చేసితినని” అతడు చెప్పి పోయి ఉరిపెట్టుకొని చచ్చెను

(మత్తయి 27:4,5).

పాపము చాల మోసకరమైనది. నిజానికి అది ఏమి ఇయ్యలేదో దానినే వాగ్దానము చేయును. గాని అది వాగ్దానము చేసినదానికి ఖచ్చితముగా వ్యతిరేకమైన దానిని అది మానవుని కిచ్చును.

భూమి మీదికిని, మనుష్యులలో నికిని పాపము ఎట్లు ప్రవేశించెనో దాని వృత్తాంతమును మనము ఆదికాండము లో చదువగలము. దేవుడు మానవుని తన స్వరూపమందు తన పోలిక చొప్పున చేసి మానవుని సంతోషము కొరకును, సంతృప్తికొరకును తగిన యేర్పాట్లు చేసెను. ఏదేను వనములో నివసించే గొప్ప భాగ్యమును దేవుడు మానవుని కిచ్చెను. ఆ తోటను కాయుటకును, సేద్యపరచుటకును దేవుడు మానవునికి బాధ్యత నప్పగించెను. అయితే దేవుడు మానవుని ఒక విషయములో నిషేధించెను. ఇది మానవుని మేలుకొరకై ఇయ్యబడెను. మంచిచెడ్డలను తెలియజేయు వృక్ష ఫలములను అతడు తినకూడదని నిషేధించబడెను. అతడు దానిని తినిన యెడల దాని పర్యవసానము చాల తీవ్రముగా యుండును. “నీవు వాటిని తిను దినమున నిశ్చయముగా చచ్చెదవని” దేవుడు నరుని కాజ్ఞాపించెను (ఆది 2:17).

**నిశ్చయించుకొను వ్యక్తిగా దేవుడు మానవుని చేసెను.** మానవుడు దేవునికి విధేయుడగుటకుగాని, అవిధేయుడగుటకు గాని నిశ్చయించు కొన వచ్చును. అయితే విచారకరమైన రీతిగా మానవుడు దేవుని కవిధేయుడ గుటకు నిశ్చయించుకొనెను. ఒక మనుష్యుని అవిధేయతవలన అనేకులు పాపులుగా చేయబడిరి (రోమా 5:19). ఆదాము ద్వారా మానవజాతికి పాపము పరిచయము చేయబడెను. కాని ఆదాము యొక్క పాపము ప్రతి ఫలము పొందకుండా పోలేదు. దేవుని ఆజ్ఞకు అవిధేయత చూపిన యెడల మరణము సంభవించునని దేవుడు చెప్పెను. మరణమనగా శరీరము నుండి ఆత్మ వేరగుటయని, మరల దేవుని నుండి మానవుడు వేరగుట



యని బైబిలు వర్ణించుచున్నది.

ఆదాము యొక్క పాపమువలన శారీరక మరణము ఖచ్చితమైనది. పౌలు మృతుల పునరుత్థానమును గూర్చి చెబుతూ, “ఆదామునందు అందరు ఏలాగు మృతిపొందుచున్నారో, ఆలాగుననే క్రీస్తునందు అందరు బ్రతికింపబడుదురు” అని పలికెను (1కొరింథీ 15:32). నేటి మానవులు ఆదాము చేసిన పాపము యొక్క ప్రతి ఫలమును అనగా భౌతిక మరణమును పొందుచున్నారు. అయితే పాపపు ప్రతి ఫలము నుండి పాపపు అపరాధమును వారసత్వముగా పొంది పసిబిడ్డలు జన్మించుట లేదు, గాని వారు పాపపు లోకములోనికి జన్మించుచున్నారు.

**భౌతిక మరణ మొక్కటే ఆదాము పాపము యొక్క పర్యవసానమని తలంచుట విచారకరము.** నీవు దాని ఫలము లను తినిన రోజున నిశ్చయముగా చచ్చెదవని దేవుడతనికి చెప్పెను. అయితే నిషేధింపబడిన ఫలమును తినిననాడే ఆదాము చనిపోలేదు. ఏదేను వనము నుండి త్రోలివేయబడిన తరువాత అనేక సంవత్సరములు అతడు బ్రతికి యుండి కయీను, హేబెలు, షేతులను మిగతాకుమారులను, కుమార్తెలను కనెను (ఆది 5:1-4). ఆదాము బ్రతికిన దినము లన్నియు తొమ్మిదివందల ముప్పది యేండ్లు; అప్పుడతడు మృతిబొందెను అని బైబిలు చెప్పుచున్నది (ఆది 5:5). దేవుని ఆజ్ఞనతిక్రమించిన రోజునే ఆదాము భౌతికముగా మరణించక పోయినను అతడు ఆత్మీయముగా మరణించెను. అంటే అతని పాపము వలన దేవుని నుండి అతడు వేరు చేయబడెను.

మానవులు దేవునికి వ్యతిరేకముగా పాపము చేయునప్పుడు, వారు దేవుని నుండి వేరుచేయబడుదురు. “మీ దోషములు మీకును మీదేవునికిని అడ్డముగా వచ్చెను, మీ పాపములు ఆయన ముఖమును మరుగుపరచెను” అని యెషయాప్రవక్త పలికెను (యెషయా 59:1,2). పాపము వలన మానవుడు దేవుని నుండి నిత్యము వేరు చేయబడే ప్రమాదమున్నది. నరకము

# సంక్షిప్తవార్తలు

2022 సెప్టెంబరు 23వ తేదీ బుధవారం మధ్యాహ్నం రిక్కీ గూటం గారు తన ఆరు వారముల పర్యటన ముగించుకొని క్షేమముగా కాకినాడ చేరుకొన్నారు. అమెరికాలో యుండగా పలుచోట్ల భారతదేశంలో జరుగుచున్న పనిని గూర్చి తెలియ జేసిరి. సెప్టెంబరు 12వ తేదీనాడు హెండర్సన్, టెన్నీసీలో యున్న ఫ్రీడ్ హార్డియన్ యూనివర్సిటీ వారి ఆహ్వానము మేరకు అక్కడి యువతీ యువకులనుద్దేశించి గొప్ప ప్రసంగము చేసిరి. ఆ యూనివర్సిటీ ప్రొఫెసర్లు, అధికారులు, విద్యార్ధినీ విద్యార్ధులు రిక్కీ గారిని అభినందించిరి.

సెప్టెంబరు 10, 11 తేదీలలో జాషువా దంపతులు, రోనీగూటం గారు కుటుంబసమేతముగా ముస్సోరి రాష్ట్రములో బ్రూస్పింగ్ వెళ్ళి అక్కడ మూడు దినములు గడిపిరి. 11వ తేదీ ఆదివారం జాషువా గారు అక్కడ సంఘములో బైబిలు క్లాసులోను, ఆరాధనలోను వాక్యపరిచర్య చేసిరి. సెప్టెంబరు 17, 18 తేదీలలో ఇండియానాలోయున్న సహోదరులు జాన్‌ఫోర్డ్ గారిని ఆయన కుటుంబమును దర్శించిరి. జాన్‌ఫోర్డ్ గారు చాలాకాలము కాకినాడ స్కూల్ ఆఫ్ ప్రీచింగ్‌కు సహాయ పడిరి. అక్కడ గొప్ప భవన నిర్మాణమునకు సహాయపడిరి. మూడు సంవత్సరముల క్రితం తీవ్రమైన కారు యాక్సిడెంట్‌లో చిక్కుకొని, నాటి నుండి మంచమునకే పరిమితమయ్యిరి. పక్షవాతము వలన ఆయన తన సహజచలన శక్తిని కోల్పోయారు. కంప్యూటర్ ద్వారా చలించే కుర్చీలో కూర్చొని ఆయన ఆరాధనకు హాజరగుచున్నారు. ఆయన సతీమణి నేన్సీఫోర్డ్‌గారు గొప్ప పరిచర్యచేయుచు క్రీస్తునందలి విశ్వాసముతో ధైర్యముగానే యున్నారు. జాన్‌ఫోర్డ్ గారి కొరకు, ఆయన కుటుంబసభ్యుల కొరకు ప్రార్ధించ మనవి.

సెప్టెంబరు 24వ తేదీ నుండి 26 తేదీ వరకు సోదరులు గేరీ జోన్స్ గారు కాకినాడలో సువార్త పరిచర్యలో పాల్గొనిరి. ఆదివారం ఆరాధనలో చక్కటి వాక్య పరిచర్య గావించిరి. ఆయన అస్సాం రాష్ట్రములో గత 15 సంవత్సరములుగా కాపురముంటూ, స్కూళ్లు స్థాపించి, వ్యవసాయము కూడ చేయుచు ప్రభువు సేవలో తోడ్పడుచున్నారు.

సత్యవాణి స్కూల్ ఆఫ్ ఎవాంజలిజమ్ ఆన్‌లైన్‌లో నిరాటంకముగా నడుచు చున్నది. దేశమంతటా వాక్యమును గూర్చి ఆసక్తిగల అనేకులు శ్రద్ధతో వాక్యము



నేర్చుకొనుచున్నారు. ఆ స్కూల్‌లో చేరదలచినవారు సత్యవాణి ఆఫీసుకు ఫోన్‌చేసి వివరములు తెలిసికొనగలరు.

2022 సెప్టెంబరు 7వ తేదీనాడు కాకినాడ క్రీస్తుసంఘ సభ్యులు సోదరులు ఎలిపే ప్రభాకర్ గారు ప్రభువు నందు నిద్రించిరి. ఆయన మొదట బిక్కవోలులోను, తదుపరి కాకినాడ సత్యవాణి క్రీస్తు సంఘములోను సభ్యులుగా యుండిరి కుటుంబ సమేతముగా నమ్మకమైన క్రైస్తవ జీవితమును జీవించిరి 9వ తేదీనాడు ఆయన జ్ఞాపకార్ధ స్తుతికూటము వారి స్వగృహమునందు జరిపించిరి. బంధువులు, మిత్రులు, పలు సంఘముల సభ్యులు హాజరై ఆయన విడిచి వెళ్లిన సతీమణి సువార్తమ్మ గారిని, కుటుంబసభ్యులను ఆదరించిరి.

కాకినాడ సత్యవాణి నుండి అనేకులు బైబిలు కరస్పాండెన్సు కోర్సు చేయుచు బైబిలు గ్రంధమును ఉచితముగా పొందుచున్నారు. మీరు కూడ మీ సంఘ సభ్యులను, కుటుంబసభ్యులను ఆ కోర్సులో చేర్పించండి.